# ‘విశ్వంభర’లో అదిరిపోయే ఐటమ్ నంబర్?



ఈ ఏడాది రాబోతున్న చిరంజీవి సినిమా ‘విశ్వంభర’. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకుంది. ఓ వైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ఇదిలావుంటే.. ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన న్యూస్ ఒకటి వెలుగు చూసింది. కథానుగుణంగానే ఈ సినిమాలో ఐటెం సాంగ్‌ని మేకర్స్ ప్లాన్ చేశారట. నిజానికి ఈ సినిమా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి కాగా, కేవలం ఈ పాట కోసమే భీమ్స్ సిసిరోలియోని మేకర్స్ రంగంలోకి దింపారట. ప్రస్తుతం భీమ్స్ ఈ పాటను స్వరపరిచే పనిలో ఉన్నారట. ఈ ఐటమ్‌సాంగ్‌లో చిరంజీవితోపాటు నర్తించే అదృష్టాన్ని కన్నడ నటి నిశ్వికా నాయుడు సొంతం చేసుకున్నదని సమాచారం. కన్నడ చిత్రం ‘కరటక దమనక’లో ప్రభుదేవతో కలిసి నిశ్వికా నర్తించిన ‘హితలకా కరిబయడా మావ..’ సాంగ్ తెలుగునాట కూడా ఎంత హిట్ అయ్యిందో తెలిసిందే. ఆ పాటలో ప్రభుదేవాకు ధీటుగా డాన్స్ చేసిన నిశ్వికా.. త్వరలో మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనుందని ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో టాక్. యూవీ క్రియేషన్స్ పతాకంపై వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# ‘పెద్ది’లో రామ్ బుజ్జిగా..



అగ్రహీరో రామ్‌చరణ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘పెద్ది’. ‘ఉప్పెన’ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ చిత్రంలో ‘రామ్ బుజ్జి’గా పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు ‘మీర్జాపూర్’ సిరీస్ ఫేం దివ్యేందుశర్మ. ఈ రోజు ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలోని ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న దివ్యేందుశర్మను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్లో భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్‌ని షూట్ చేస్తున్నారు. మైండ్‌బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాలో మేజర్ హైలైట్ కానున్నాయని మేకర్స్ చెబుతున్నారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు ఇతర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్.

# ఆదర్శవాది అపూర్వగా..



‘వ్యంగ్యంతో కూడిన హృద్యమైన కథ ‘ఉప్పుకప్పురంబు’. ఇందులో అపూర్వగా కనిపిస్తా. దృఢనిశ్చయం కలిగిన ఆదర్శవాది అపూర్వ. అయితే.. విషయ పరిజ్ఞానం మాత్రం తక్కువ. భిన్నమైన పాత్ర అన్నమాట. గ్రామీణ సంస్కృతుల నేపథ్యంలో ఈ పాత్ర సాగుతుంది. ఓ గంభీరమైన సమస్యను ప్రజల దృష్టికి తీసుకురావడానికి నా పాత్ర చేసే ప్రయత్నం ఆసక్తికరంగా, మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది.’ అని కీర్తి సురేశ్ చెప్పారు. ఆమె, సుహాస్ ముఖ్య పాత్రధారులుగా నటించిన వ్యంగ్య హాస్యభరిత చిత్రం ‘ఉప్పుకప్పురంబు’. ఐ.వి.శశి దర్శకుడు. రాధిక లావూ నిర్మాత. ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వేదికగా జూలై 4 నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో కీర్తి సురేశ్ మాట్లాడారు. ఇందులో తాను చిన్నాగా నటిస్తున్నానని, తాను ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నమైన పాత్ర ఇదని హీరో సుహాస్ తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నర.

# 50కోట్లతో వారణాసి సెట్



రాజమౌళి సినిమా అంటేనే భారీతనానికి చిరునామా. గ్రాండ్ విజువల్స్..అందుకోసం రూపొందించే సెట్స్ విషయంలో ఆయనెప్పుడూ కాంప్రమైజ్ కారు. తాజా సమాచారం ప్రకారం మహేష్‌బాబుతో రాజమౌళి రూపొందిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ కోసం భారీ స్థాయిలో సెట్స్‌ను తీర్చిదిద్దుతున్నారట. ఆర్‌ఆర్‌ఆర్, బాహుబలి సినిమాల్లో వెండితెరపై సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించిన రాజమౌళి తన తాజా సినిమా కోసం దేశంలోనే అత్యంత ఖరీదైన సెట్స్‌ను వేయిస్తున్నట్లు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళితే..రాజమౌళి, మహేష్ బాబు కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇప్పటికే మూడు షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుంది. తాజాగా కొత్త షెడ్యూల్‌కు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో దాదాపు 50కోట్ల భారీ వ్యయంతో వారణాసి సెట్‌కు రూపకల్పన చేస్తున్నారని తెలిసింది. ఇక్కడ సినిమాకు సంబంధించిన కీలక ఘట్టాలను తెరకెక్కిస్తారని సమాచారం. యస్‌యస్‌ఎంబీ29 వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రానికి కె.ఎల్.నారాయణ నిర్మాత

# ‘మజిలీ’ దర్శకుడితో 25వ సినిమా?

అక్కినేని నాగచైతన్య 25వ చిత్రానికి రంగం సిద్ధమవుతున్నది. ప్రస్తుతం ఆయన కార్తీక్ దండు దర్శకత్వంలో తన 24వ సినిమాను చేస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.



ఈ సినిమా తర్వాత శివ నిర్వాణ దర్శకత్వంలో నాగచైతన్య తన 25వ సినిమా చేయనున్నారు. ఇప్పటికే శివ నిర్వాణ చెప్పిన కథక చైతూ ఓకే చెప్పేశారు. మైత్రీ మూవీమేకర్స్ ఈ సినిమాను నిర్మించనున్నది. నాగచైతన్య, శివ నిర్వాణ కాంబినేషన్‌లో వచ్చిన ‘మజిలీ’ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకోవడంతోపాటు వాణిజ్యపరంగా కూడా మంచి విజయాన్ని సాధించింది. వీరిద్దరు రెండోసారి కలిసి పనిచేస్తున్న ఈ చిత్రం ‘మజిలీ’ని మించిన ఎమోషన్స్‌తో సాగుతుందని సమాచారం. ప్రస్తుతం శివ నిర్వాణ డైలాగ్ వెర్షన్‌ని సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని సమాచారం.

# ఎవరినీ కించపరచలేదు



‘కన్నప్ప’ చిత్రంలో బ్రాహ్మణులనుగాని, ఇతర కులాల వారికిగాని కించపరచలేదని చిత్ర రచయితల్లో ఒకరైన ఆకెళ్ల శివప్రసాద్ అన్నారు. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం ‘కన్నప్ప’ ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని బ్రహ్మానందం, సప్తగిరి పాత్రల పేర్లు తమ వర్గాన్ని అపహాస్యం చేసేలా ఉన్నాయని బ్రాహ్మణ సంఘాలు కోర్టుకెక్కాయి. ఈ వివాదంపై రచయిత ఆకెళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ ‘ఈ చిత్రాన్ని ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యం ఆధారంగా తెరకెక్కించాం. ఇందులోని ప్రతి పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకులకు చూపించాం. వారు ఎంతో గొప్పగా ఉందని ప్రశంసించారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఈ సినిమాను తీశారు. ఏ వర్గం వారిని కించపరిచే ఉద్దేశ్యం చిత్రబృందానికి లేదు. దయచేసి వదంతులను నమ్మొద్దు’ అని కోరారు. ఈ చిత్రానికి ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.

# మెగా ఫోన్ పట్టనున్న చందమామ?




నటి కాజల్ అగర్వాల్ మెగా ఫోన్ పట్టనున్నారు. కెరీర్ పీక్స్ ఉన్నప్పుడే తన చిరకాల మిత్రుడు గౌతమ్ కిచ్లుని పెళ్లాడేసి, వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన ఈ అందాల చందమామ.. ‘భగవంత్ కేసరి’తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలపెట్టారు. ఆ సినిమా ఘన విజయం సాధించినా ఆ క్రెడిట్ అంతా బాలకృష్ణ, అనిల్ రావిపూడిల ఖాతాలో పడిపోవడంతో కాజల్‌కి మాత్రం ఆ స్థాయి అవకాశం మళ్లీ రాలేదు. ఈ నెలలోనే ఆమె పార్వతీదేవి పాత్రలో నటించిన ‘కన్నప్ప’ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే రెండు దశాబ్దాల తన అనుభవాన్నంతా క్రోడీకరించి, ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించేందుకు కాజల్ సిద్ధమయ్యారని బీటౌన్ టాక్. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన విడుదల కానుంది.



# మధ్య తరగతి సోలో బాయ్

‘బిగ్‌బాస్’ఫేం గౌతమ్‌కృష్ణ, పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం ‘సోలో బాయ్’. నవీన్‌కుమార్ దర్శకుడు. సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాత. జూలై 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణార్థం నిర్వహించిన ‘ఆపరేషన్ సిందూర్’లో అమరుడైన తెలుగు జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రులు ఈ ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబించే కథతో ఈ సినిమా రూపొందిందని, తారాగణంతో పాటు టెక్నికల్ బృందం కూడా మనసు పెట్టి పనిచేశారని దర్శకుడు తెలిపారు. హీరో గౌతమ్‌కు ఈ సినిమా మంచి బ్రేక్ అవుతుందని నిర్మాత సతీష్ నమ్మకం వెలిబుచ్చారు. ఇందులో కంటెంటే హీరో అని, దర్శకుడు నవీన్ అద్భుతంగా సినిమా చేశారని హీరో గౌతమ్ కృష్ణ తెలిపారు. ఇంకా నిర్మాత దామోదర ప్రసాద్, ‘లైఫ్‌ఈజ్ బ్యూటిఫుల్’ఫేం సుధాకర్, దర్శకుడు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కూడా మాట్లాడారు.

# విరాటపాలెం: PC మీనా రిపోర్టింగ్



అభిజ్ఞా పూతలూరు, చరణ్ లక్కరాజు నటించిన వెబ్ సిరీస్ ‘విరాటపాలెం: PC మీనా రిపోర్టింగ్’. సూపర్ నాచురల్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న ఈ సీరిస్‌కి కృష్ణ పోలూరు దర్శకుడు. శ్రీరామ్ నిర్మాత. ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో ఈ నెల 27న నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో ఈ వెబ్‌సిరీస్ ట్రైలర్‌ను హీరో నవీన్‌చంద్ర విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. తాను డైరెక్ట్ చేసిన వెబ్‌సిరీస్ ‘రెక్కీ’ మాదిరిగానే ఈ ‘విరాటపాలెం’కూడా మంచి విజయం సాధిస్తుందని, కథ ఈ చిత్రానికి ప్రధానబలమని దర్శకుడు కృష్ణ పోలూరు అన్నారు. ఇంకా నిర్మాత శ్రీరామ్, హీరోయిన్ అభిజ్ఞ, చరణ్ లక్కరాజు, డీవోపీ మహేష్ కె.స్వరూప్, కథా రచయిత దివ్య కూడా మాట్లాడారు.





